

ఓం నమః శివాయ

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని కాలేజీరోడ్డు గోదావరి నదికి సమీపంలో నిర్మిస్తున్న మహాప్రస్థానం(వైకుంఠధామం)లో రూ.42లక్షల నిధులతో నిర్మిస్తున్న శివుని విగ్రహం ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఈ నెల 26న మహాప్రస్థానాన్ని ప్రారంభించేందుకు నిర్మాణ పనులను వేగంగా చేస్తున్నారు. మహాప్రస్థానంలోకి వెళ్లగానే ఆకట్టుకునేలా శివుని విగ్రహాన్ని నిర్మించారు.



వింత చేప

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేట శివారులోని ఎల్లంపల్లి జలాశయంలో బుధవారం స్థానిక జాలర్లకు ఓ అరుదైన చేప చిక్కింది. ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌లో కట్టి ఉంచిన వలలో చిక్కగా, చేప ప్రియులు దానిని చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. మత్స్యకారులు చేప గురించి అడగా దాని పేరు శీకు మొట్ట అని, దాని విలువ కిలోకు రూ.500 వరకు ఉంటుందని తెలిపారు.



పేరుకే నో ఎంట్రీ

భీమారం: మండలంలోని పోతన్‌పల్లి అటవీ ప్రాంతంలోని మాంతమ్మ వద్ద రిజర్వుఫారెస్ట్ లోకి వెళ్లకుండా రెండేళ్ల క్రితం అటవీశాఖ అధికారులు నో ఎంట్రీ గేటు ఏర్పాటు చేశారు. అది కేవలం అలంకారప్రాయంగా మాత్రమే ఉంది. గేటు పక్క నుంచి రాకపోకలు కొనసాగిస్తున్నారు. అటవీశాఖ కేవలం నిధులు ఖర్చు చేసేందుకే ఆ గేటు ఏర్పాటు చేసినట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు.



చేపల వేట..!

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుబ్బరాంపల్లి గ్రామ సమీపంలోని కుంటలో నీరు ఎండలకు ఇంకిపోతుంది. కొద్దిగా ఉన్న నీటిలో చేపలు ఉండటంతో కొందరు వ్యక్తులు వలలతో చేపలు పడుతున్నారు. అటు వైపుగా వెళ్తున్న 'సాక్షి' వారిని కెమెరాలో బంధించింది. సుమారు రెండు నుంచి నాలుగు కిలోల వరకు చేపలు దొరికినట్లు వారు తెలిపారు.





హోదా మారినా.. పేరు మారలే

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా మారుస్తూ గత నెల 28న ఉత్తర్వులు వెలువడ్డాయి. మంచిర్యాల మున్సిపాలిటీలో నస్పూర్ మున్సిపాలిటీతో పాటు హాజీపూర్ మండలంలోని పోచంపాడ్, గుడిపేట్, నర్సింగాపూర్, నంనూరు, చందనాపూర్, ముల్కల్ల, కొత్తపల్లి, వేంపల్లి గ్రామపంచాయతీలను కలుపుతూ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారు. వెనువెంటనే విలీన మున్సిపాలిటీ, గ్రామాల్లో నగరపాలక సంస్థ, మంచిర్యాల పేరిట బోర్డులను ఏర్పాటు చేశారు. మంచిర్యాల మున్సిపల్ కార్యాలయానికి రాసిన పురపాలక సంఘం పేరును నగరపాలక సంస్థగా మార్చారు. నగరపాలక సంస్థగా ఏర్పడి 20రోజులు దాటినా, కార్పొరేషన్ కార్యాలయంలోకి వెళ్లే దారిలో పురపాలక సంఘ కార్యాలయం, మంచిర్యాల బోర్డును, గేటుకు ఉన్న మున్సిపాలిటీ అక్షరాలను మార్చలేదు.

క్లుప్తంగా

ఎస్సీ కార్పొరేషన్ నిధులు విడుదల చేయాలి

శ్రీరాంపూర్: ఎస్సీ కార్పొరేషన్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే.నర్సింగ్ డిమాండ్ చేశారు. బుధవారం శ్రీరాంపూర్‌లోని హిమ్మత్‌నగర్‌లో నస్పూర్ పట్టణ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. నస్పూర్ పట్టణ నూతన కమిటీని కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా చెవుల వాసు, ఉపాధ్యక్షుడిగా పుట్ట రవి, ప్రధాన కార్యదర్శిగా పార్లపల్లి సారయ్య, ప్రచార కార్యదర్శిగా తలారి విజయ్, గౌరవ సలహాదారులుగా, తరాల లక్ష్మీనారాయణను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు గుమ్మడి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు తలారి రాజు, ఉపాధ్యక్షుడు శీలం రంజిత్‌కుమార్, నాయకులు తరాల శ్రీహరి, చీమల రాజలింగు, చౌకల రాములు, సొల్లు కొమురయ్య, ఎం.సామల్ పాల్గొన్నారు.

భయం వీడితేనే విజయం

- డీఈవో యాదయ్య



దండేపల్లి: విద్యార్థి ప్రతిభ సామర్థ్యం పరిశీలిస్తున్న డీఈవో యాదయ్య

దండేపల్లి: పదో తరగతి విద్యార్థులు పరీక్షలంటే ఏ మాత్రం భయపడకుండా, కష్టపడి చదివితే విజయం తప్పక వరిస్తుందని డీఈవో యాదయ్య సూచించారు. దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి, పలు ప్రశ్నలు వేసి ప్రతిభ సామర్థ్యాలను పరీక్షించారు. పరీక్షలకు కొద్దిరోజులే సమయం ఉంది కాబట్టి, సమయాన్ని వృథా చేయకుండా బాగా చదువుకుని, మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం రుచి చూశారు. కార్యక్రమంలో ఎంఈవో చిన్నయ్య, ఉపాధ్యాయులు, సీఆర్పీ నర్సయ్య పాల్గొన్నారు.



బెల్లంపల్లి ఆర్టీసీ బస్టాండ్

సమస్యల బస్టాండ్..!

- ప్రయాణికులను వేధిస్తున్న తాగునీరు, మరుగుదొడ్లు
- గాడితప్పిన పారిశుధ్య నిర్వహణ
- పాడైపోయిన టీవీ, పట్టించుకోని అధికారులు
- అధ్వానంగా తయారైన బెల్లంపల్లి బస్టాండ్

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో సమస్యలు పేరుకుపోయాయి. సౌకర్యాలు కరువై అధ్వాన్నంగా తయారైంది. ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో పరిధిలో ఉన్న ఈ బస్టాండ్ దుస్థితి ఏళ్లు గడుస్తున్నా.. ఏమాత్రం మెరుగుపడకపోగా సమస్యలన్నీ ×ఎక్కడ వేసిన గొంగళి అక్కడే । అన్న చందంగా తయారయ్యాయి. 1991 ఫిబ్రవరి 1న అప్పటి రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పి.సాంబశివరాజు హాజరై ప్రారంభించిన బస్‌స్టేషన్ పాలకులు, ఆర్టీసీ అధికారుల పట్టింపులేని తనంతో నానాటికీ దిగజారిపోతోంది. బెల్లంపల్లిలో బస్‌డిపో మంజూరు చేయిస్తామన్న పాలకుల హామీ గాలిలో కలిసిపోగా, కనీసం సమస్యలు తీర్చడానికైనా ముందుకు రాకపోవడం విడ్డూరం కలిగిస్తోంది. బెల్లంపల్లి బస్టాండ్ నుంచి రోజువారీగా వందలాది మంది ప్రయాణికులు ఆసిఫాబాద్– మంచిర్యాల వైపునకు రాకపోకలు సాగిస్తుండగా, సరి పడా బస్సులు నడిపించడంలో, కొత్త ప్రాంతాలకు బస్‌రూట్లను సర్వే చేయించడంలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి పాలకులు, అధికారులు సత్వర చర్యలు తీసుకొని ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



విరిగిపోయిన ఓ గది తలుపు రెక్క

పేరుకుపోయిన సమస్యలు

- ప్రయాణికులకు ఎండాకాలంలో చల్లని తాగునీరు లేకుండా పోయింది. సింగరేణి నీటి సరఫరాను నిలిపివేసింది. దీంతో కొత్తగా బోరువేసి నీటిని సరఫరా చేస్తుండగా, ఆ నీటిని ప్రయాణికులు తాగలేకపోతున్నారు.
- బస్‌స్టేషన్‌లో ఫ్యాన్‌లు ఉన్నా సరిగ్గా పనిచేయడం లేదు. ఆరుబయట నుంచి వచ్చే గాలితో ప్రయాణికులు సేద తీరాల్సి వస్తోంది.
- బస్‌స్టేషన్ ప్రాంగణంలో పారిశుధ్య నిర్వహణ గాడి తప్పింది. సరిగ్గా శుభ్రం చేయకపోవడంతో దుమ్ము పేరుకుపోయి ఉంటోంది.
- బస్టాండ్‌లో ప్రయాణికులకు వినోదం కలిగించడం కోసం ఏర్పాటు చేసిన టీవీ మరమ్మతులకు వచ్చి ఏళ్లు గడుస్తున్నా, రిపేరు చేయించకపోవడంతో అలంకారప్రాయంగా ఉంది.
- మరుగుదొడ్లు, మూత్రశాలలకు నీటి సౌకర్యం ఉన్నా రోజువారీగా శుభ్రం చేయించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు.
- బస్‌స్టేషన్‌లో కంట్రోలర్ ఉండాల్సి ఉన్నా, ఏళ్ల తరబడి నుంచి నియమించడం లేదు.
- కంట్రోలర్ రూమ్, విచారణ గది దుమ్ముపట్టి, అద్దాలు పగిలిపోయి, తలుపు రెక్క విరిగిపోయి ఎందుకు కొరగాకుండా తయారయ్యాయి.
- బస్టాండ్ ప్రాంగణమంతా పిచ్చిమొక్కలతో నిండి ఉంది. వీటిలో నుంచి పాములు, తేళ్లు రాత్రి పూట బయటకు వస్తుండటంతో ప్రయాణికులు, రాత్రిపూట బస్టాండ్‌లో నిద్రించే ఆర్టీసీ బస్ కండక్టర్, డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు.
- బస్టాండ్ అంతర్భాగంలో ఏర్పాటు చేసిన టైల్స్ పెచ్చులూడి పాడైపోతున్నాయి.

సమస్యలు తీర్చాలి



బస్టాండ్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. ప్రయాణికులకు బోరు నీరు కాకుండా శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలి. ఎండాకాలంలో చల్లని నీటిని అందించాలి. ఫ్యాన్లు, టీవీలకు మరమ్మతు చేయించి వినియోగంలోకి తేవాలి. పారిశుధ్యం పేరుకుపోకుండా చర్యలు తీసుకుని రోజువారీగా మరుగుదొడ్లు, మూత్ర శాలలు శుభ్రం చేయించాలి.అధికారులు ప్రతి వారం రోజుల కోసారైన బస్టాండ్‌కు వచ్చి పర్యవేక్షణ చేయాలి.

– ఎండి.గౌస్, బెల్లంపల్లి

హామీలు అమలు చేయాలి



బెల్లంపల్లి కేంద్రంగా ఆర్టీసీ బస్‌డిపో ఏర్పాటు చేస్తామని నాయకులు ఎన్నికల్లో హామీలిచ్చి, గెలిచిన తర్వాత విస్మరిస్తున్నారు. ముప్పై ఏళ్ల నుంచి ఇదే తంతు కొనసాగుతోంది. ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేలలో ఇంతవరకు ఏ ఒక్కరు కూడా ఆ హామీని నెరవేర్చలేదు. గ్రామీణ ప్రాంతాల్లో కొత్త రూట్ల సర్వే చేయించి తగినన్ని బస్సులు నడిపించాలి. సుదూరప్రాంతాలకు వెళ్లడానికి బెల్లంపల్లి నుంచి ప్రత్యేకంగా బస్సులు నడిపించాలి.

– శ్రీనివాసరాజు ,బెల్లంపల్లి



చెన్నూర్ అయ్యప్పస్వామి ఆలయం నుంచి ర్యాలీ



కవ్వాల్‌లో నివాళులర్పిస్తున్న యూత్ సభ్యులు

ఘనంగా శివాజీ జయంతి

దండేపల్లి/భీమారం/తాండూర్/జన్నారం/పాత మంచిర్యాల/వేమనపల్లి/మందమర్రిరూరల్/జైపూర్/చెన్నూర్: జిల్లా వ్యాప్తంగా శివాజీ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ, బీజేవైఎం, కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లతో పాటు వివిధ కుల సంఘాల నాయకులు ర్యాలీలు నిర్వహించారు. శివాజీ వీరోచిత పోరాటాన్ని స్మరిస్తూ శ్రద్ధాంజలి ఘటించారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.



తాండూర్: శోభాయాత్ర చేస్తున్న యువకులు



భీమారంలోని ఆర్కెపల్లి పాఠశాలలో...

క్రైం కార్నర్..

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ధ్వంసమైన కారు

భీమారం: మండల కేంద్రంలోని కేజీబీవీ సమీపంలో జాతీయరహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్సై శ్వేత కథనం ప్రకారం..చెన్నూరు నుంచి మంచిర్యాల వైపు కారు వెళ్తోంది. కన్నాల నుంచి చెన్నూరు వైపు వస్తున్న కంకరలోడ్ టిప్పర్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ఉన్న మంచిర్యాలలోని సున్నంబట్టివాడకు చెందిన కొండగొర్ల దేవక్క, వాణిలకు గాయాలయ్యాయి. వీరిని స్థానికులు 108లో మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

లక్సెట్టిపేట: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. ఇద్దరు డ్రైవర్లపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు.

జైపూర్: మండలంలోని కుందారం, కిష్టాపూర్, వేలాల, శివ్వారం గోదావరి నది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్ల యాజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

సీనియర్ అసిస్టెంట్ మృతి

జైపూర్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న డి.పరమేశ్వరి(39) అనారోగ్యంతో హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మంగళవారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బుధవారం బెల్లంపల్లి మండలం లింగధరిగూడంలో అంత్యక్రియలు నిర్వహించగా జిల్లా అడిషనల్ కలెక్టర్ మోతిలాల్, బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, జైపూర్ తహసీల్దార్ వనజారెడ్డి, తాండూర్ తహసీల్దార్ ఇక్రమాన్, డిప్యూటీ తహశీల్దార్ ప్రసాద్, రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొని నివాళులర్పించారు.

శ్రీరాంపూర్ జీఎంగా శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరణ

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ నూతన జీఎంగా ఎం.శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన జీఎం ఎల్వీ సూర్యనారాయణ డైరెక్టర్‌గా పదోన్నతి పొంది బదిలీ కావడంతో, బెల్లంపల్లి జీఎంగా ఉన్న జీఎం ఎం.శ్రీనివాస్‌ను యాజమాన్యం ఇక్కడికి బదిలీ చేసింది. దీంతో బుధవారం జీఎం కార్యాలయంలోని తన చాంబర్‌లో రికార్డుల్లో సంతకం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఏరియా ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, ఏరియా అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆ జీఎం డిపార్టుమెంట్ల ముఖ్య అధికారులతో సమావేశమై ఏరియా వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏజీఎం (ఫైనాన్స్) మురళీధర్, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి ఏవీ రెడ్డి, ఏజెంట్లు శ్రీధర్, వెంకటేశ్వర్లు, డీజీఎంలు అరవిందరావు, ఆనంద్ కుమార్, చిరంజీవులు, చంద్రలింగం, డిప్యూటీ సీఎంవో రమేష్ బాబు పాల్గొన్నారు. శ్రీరాంపూర్ నూతన జీఎంగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌ను టీబీజీకేఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం చేశారు.



జీఎంను సన్మానిస్తున్న ఏరియా అధికారులు

ఓసీ కార్మికులను మభ్య పెడుతున్న అధికారులు

- ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి అక్బర్‌అలీ

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని ఆర్కే ఓసీ కార్మికులను సింగరేణి అధికారులు మభ్య పెడుతున్నారని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి ఎండీ.అక్బర్‌అలీ ఆరోపించారు. ఓసీ మూసివేస్తున్న నేపథ్యంలో ఇక్కడి కార్మికులను ఎక్కడ సర్దుబాటు చేస్తారో స్పష్టతనివ్వకుండా వారిని ఆందోళనకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఓసీలో బుధవారం ఏర్పాటుచేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. ఏదైనా గని మూసివేస్తున్నప్పుడు కార్మికులను పలానా చోటికి పంపిస్తామని ముందుగా నోటీస్ బోర్డులో పెట్టేవారని, తద్వార కార్మికులు కూడా అప్లికేషన్లు పెట్టుకునేవారన్నారు. ఇప్పుడు అలాంటిదేమి లేకుండా ఇక్కడిక్కడే సర్దుబాటు చేస్తామంటూ మభ్యపెడుతున్నారన్నారు. ఇప్పటికైనా ఏరియా అధికారులు స్పందించి ఓసీ కార్మికులను పారదర్శకంగా సర్దుబాటు చేయాలని, లేకపోతే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు ఇప్పకాయల లింగయ్య, పిట్ కార్యదర్శి రామకృష్ణ. వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పోరాట ఫలితంగానే వేతనాలు'

శ్రీరాంపూర్: పోరాటాల ఫలితంగానే నర్సరీ కార్మికులకు కనీస వేతనాలు, ఇతర సౌకర్యాలకు సంబంధించిన జీవో విడుదలయ్యిందని ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్ తెలిపారు. నర్సరీ వద్ద బుధవారం కాంట్రాక్ట్ కార్మికులతో మాట్లాడారు. మార్చి ఒకటో తారీకు నుంచి కనీస వేతనాల జీవో ప్రకారం వేతనాలు చెల్లిస్తారని, బోనస్ అమలు చేస్తారని తెలిపారు. సీఎంపీఎఫ్, హాస్పిటల్ సౌకర్యం, బ్యాంకు ద్వారా వేతనాలు కూడా చెల్లిస్తారన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు లక్ష్మి, అనిత చిన్నక్క, లక్ష్మి, బుచ్చవ్వ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

గైర్హాజర్ కార్మికులకు కౌన్సెలింగ్

మందమర్రిరూరల్: ఏరియాలోని కేకే–5 గని ఆవరణలో గైర్హాజర్ కార్మికులకు ఆ గని మేనేజర్ ప్రవీణ్ బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్‌లో ఆ గని రక్షణ అధికారి రమేష్, సంక్షేమాధికారి రవళి, ఆఫీస్ సూపరింటెండెంట్ బుచ్చయ్య ఉన్నారు.

'సింగరేణిలో రాజకీయ జోక్యం'

మందమర్రిరూరల్: సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిందని, కోడ్ ఆఫ్ డిసిప్లెన్ అమలు చేయకుండా నాయకులు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ ఆరోపించారు. ఏరియాలోని ఏఐటీయూసీ ఆఫీస్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ముందు కార్మికవర్గానికి ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో యూనియన్ నాయకులు సుదర్శన్, శ్రీనివాస్, రాజేశం, సీపీ రమణ ఉన్నారు.

డైరెక్టర్‌కు వినతి

శ్రీరాంపూర్: సింగరేణి నూతన డైరెక్టర్(ఆపరేషన్స్) ఎల్వీ సూర్యనారాయణను గోదావరిఖనిలోని సింగరేణి గెస్ట్ హౌస్‌లో బుధవారం సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ వెంగళ శ్రీనివాస్, నాయకులు సదానందం, రాజమౌళి, నరహరి రావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

అంగన్‌వాడీ కేంద్రంలో ఆటలపోటీలు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ 2 అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అన్నప్రాసన, అక్షరభ్యాసం కార్యక్రమంను జిల్లా శిశు మహిళా దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం కేంద్రంలోని చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి సీడీపీవో విజయలక్ష్మి చేతుల మీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు మాధవి, శిరీష, ఆయా పర్వనా బేగం పాల్గొన్నారు.

'నిందితుల నుంచి కాపాడండి'

బెల్లంపల్లి: తనపై దాడి చేసిన నిందితుల నుంచి తనకు ప్రాణహాని ఉందని టీపీసీసీ భీమిని మండల సోషల్ మీడియా కో ఆర్డినేటర్ గాండ్ల కుమారస్వామి తెలిపారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయంగా, వ్యాపారపరంగా ఎదుగుతున్న తనను లక్ష్యంగా చేసుకొని ఇటీవల కొందరు దాడికి పాల్పడ్డారని తెలిపారు. నిందితుల నుంచి తనకు ప్రాణహాని ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు రాజకీయ నాయకుల ప్రోద్బలంతోనే తనపై దాడి జరిగినట్లు వివరించారు. పోలీసు ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకుని తన ప్రాణాలు కాపాడాలని వేడుకున్నారు.

'ఎమ్మెల్సీలుగా బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి'

జన్నారం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఆదిలాబాద్ ఎంపీ గెడం నగేష్ కోరారు. మండల కేంద్రంలో బుధవారం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పట్టభద్రులు, టీచర్ల ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమురయ్యలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్, పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొంతం శంకరయ్య, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బద్రీనాయక్, ప్రధాన కార్యదర్శి బురగడ్డ జగన్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు బెడద గోపాల్, బూత్ అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు గంగాధర్, రాజేందర్, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల ప్రచారం

బెల్లంపల్లి: కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గ, టీచర్స్ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థులు అంజిరెడ్డి, కొమురయ్య పక్షాన బుధవారం బెల్లంపల్లిలో బీజేపీ శ్రేణులు ప్రచారం నిర్వహించారు. వాకర్స్‌ను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ సంతోష్‌కుమార్, పట్టణ బీజేపీ అధ్యక్షురాలు కళ్యాణి, శ్రేణులు శ్రీనివాస్, మహేష్, రజినీకాంత్, చంద్రమౌళి పాల్గొన్నారు.

సర్కారు పాఠశాలలకు కంప్యూటర్లు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో మరో 12సర్కారు పాఠశాలలు, కేజీబీవీల్లో కంప్యూటర్ విద్య అమలు చేయనున్నారు. డెస్కటాప్‌లు, ప్రింటర్లు, యూపీఎస్‌లు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ప్రొసీడింగ్స్ సమగ్రశిక్ష తెలంగాణ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇటీవల పీఎంశ్రీ కింద మొదటి దఫాలో ఎంపికైన 16పాఠశాలలకు కంప్యూటర్, ప్రింటర్లు, యూపీఎస్‌లు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. మంచిర్యాలలోని జెడ్పీహెచ్‌ఎస్(గర్ల్స్), జన్నారం కిష్టంపేట జెడ్పీహెచ్, జైపూర్ కేజీబీవీ, భీమిని జెడ్పీహెచ్‌ఎస్, బెల్లంపల్లి జెడ్పీహెచ్‌ఎస్(గర్ల్స్), కన్నెపల్లి జెడ్పీహెచ్‌ఎస్, కన్నెపల్లి కేజీబీవీ, హజీపూర్ కేజీబీవీ, కాసిపేట కేజీబీవీ, అచ్చలపూర్ జెడ్పీహెచ్‌ఎస్, ఆస్నాద జెడ్పీహెచ్‌ఎస్, చంద్రవెల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు ఒక్కంటికి 5కంప్యూటర్, ప్రింటర్లు, యూపీఎస్‌లు మంజూరఅయ్యాయి.

దుకాణ సముదాయాల ఏర్పాటుకు వేలం

చెన్నూర్‌రూరల్: మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని మండలంలోని కత్తెరసాల గ్రామంలోని శ్రీ మల్లిఖార్జున స్వామి ఆలయం వద్ద మూడు రోజుల పాటు నిర్వహించే జాతరలో దుకాణ సముదాయాల ఏర్పాటుకు వేలం నిర్వహించారు. కొబ్బరికాయలు అమ్మేందుకు వేలం ద్వారా రూ.1లక్ష 16వేలు, బోనములు చెల్లించేందుకు రూ.1లక్ష 30వేలు, లడ్డూ, పులిహోర వేలానికి రూ.1లక్ష,61వేలు, నూనె అమ్మకం వేలానికి రూ.3,100 వచ్చినట్లు ఆలయ ఈవో రవి తెలిపారు. కొబ్బరి ముక్కలకు రూ.18వేలు వచ్చినట్లు తెలిపారు. మొత్తం రూ.4లక్షల 28వేల ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. గతేడాది కంటే ఈ యేడు వేలం ద్వారా రూ.1లక్ష 3వేల ఆదాయం ఎక్కువగా వచ్చినట్లు పేర్కొన్నారు. వేలంలో ఆలయ కమిటీ చైర్మన్ అంగ మల్లేష్, ధర్మకర్తల మండలి పాల్గొన్నారు.